# సాక్షి ఖమ్మం

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025




గరిష్టం/కనిష్టం
30°/23°

**వాతావరణం**
జిల్లాలో ఆదివారం ఉదయం చలి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది.

ఖమ్మం డిపో ఎదుట తెల్లవారుజామునే ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు గుండాల కృష్ణ, నున్నా నాగేశ్వరరావు, ఆవుల అశోక్, రాయల నాగేశ్వరరావు తదితరులు




## న్యూస్‌రీల్

### శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్ పాటు ఆలయ ఆవరణలోని స్వామి వారి పాదానికి పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. అలాగే, పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ఉద్యోగులు సోమయ్య, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన ఆర్‌టీఐ కమిషనర్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: ఆర్‌టీఐ కమిషనర్ పీ.వీ.శ్రీనివాసరావు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు, అధికారులకు అవగాహన, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు.

### దీపావళికి బీఎస్‌ఎన్‌ఎల్ కొత్త ప్లాన్

ఖమ్మంమయూరిసెంటర్: దీపావళి పండుగ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం కొత్త ప్లాన్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ బాబు తెలిపారు. రూ.1కే సిమ్ అందించడమే కాక 30 రోజుల కాల పరిమితితో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉంటాయని పేర్కొన్నారు. కొత్తగా సిమ్ తీసుకునే వారికే కాక పోర్టబిలిటీ వినియోగదారులకు సైతం ఈ ప్లాన్ వర్తిస్తుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని డీజీఎం ఓ ప్రకటనలో సూచించారు.

### పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఖమ్మం అర్బన్: జిల్లా వ్యాప్తంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం గొల్లగూడెం శ్రీ కృష్ణ గోశాలలో శనివారం పశువులకు వ్యాక్సిన్ వేశాక ఆయన మాట్లాడారు. రైతులంతా తమ పశువులకు వ్యాక్సిన్ వేయించాలని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈసందర్భంగా గోశాలలో 644 పశువులకు టీకాలు వేశారు. డాక్టర్ కాంతికుమార్, ఉద్యోగులు మణిదీప్, కృష్ణ, సత్యనారాయణ, గోశాల బాధ్యులు కేసా హన్మంతరావు, అకితే చౌదరి పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగుకు అగ్రిమెంట్ తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ పుల్లయ్య

వైరా: విత్తన మొక్కజొన్న కంపెనీల ప్రతినిధులతో అన్ని అంశాలపై అగ్రిమెంట్ చేసుకున్నాకే రైతులు సాగు మొదలుపెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలో ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీతో కలిసి ఆయన రైతులకు అవగాహన కల్పించారు. నోటి మాటగా చెప్పే ఏజెంట్లను నమ్మకుండా తప్పక అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. నమ్మకమైన ఏజెంట్ల వద్ద మాత్రమే విత్తనాలు తీసుకోవాలని, లాభాల పేరిట గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలను పరిగణనలోకి తీసుకోవద్దని చెప్పారు. కాగా, పత్తి రైతులు పంట నమోదు చేయించుకోవడమేకాక సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఏఓ సూచించారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓ రాజేష్, రైతులు పాల్గొన్నారు

# కొనుగోళ్లకు సిద్ధం

'జిల్లాలో పండించిన పత్తి, ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సిద్ధమైంది. అమ్మకానికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరు కూడా దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. దీపావళి తర్వాత ఎనిమిది సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి, వచ్చే నెల మొదటి వారం నాటికి 326 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలవుతాయి. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇబ్బంది రాకుండా అన్ని నియోజకవర్గాల్లో గోదావరి ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చాం. అధునాతన పరిజ్ఞానంతో ఖమ్మంలో రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నాం.' అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. పలు అంశాలపై 'సాక్షి'కి శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



**దీపావళి తర్వాత పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలు**
- 15రోజుల్లో 326కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు
- ఇందిరమ్మ ఇళ్లకు అందుబాటులో గోదావరి ఇసుక
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**యాప్‌లో నమోదు తప్పనిసరి**

దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు చర్యలు చేపట్టింది. అయితే, రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో పంట వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బందితో నమోదు చేయించుకోవాలి. తద్వారా సీసీఐ కేంద్రాల్లో పత్తిని వెంటనే కొనుగోలు చేస్తారు. ఈ విషయమై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించాం. జిల్లాలోని ఎనిమిది జిన్నింగ్ మిల్లుల్లో దీపావళి తర్వాత సీసీఐ కేంద్రాలు ఏర్పాటవుతాయి. తేమ శాతం తక్కువగా ఉండి, నాణ్యమైన పత్తిని తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలి. పత్తి కొనుగోళ్లను అదనపు కలెక్టర్, మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షిస్తారు.

**72గంటల్లోగా ధాన్యం నగదు, బోనస్**

వరి ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో 326 కేంద్రాలు తెరుస్తాం. కల్లూరు మండలంలో ముందుగా కోతలు మొదలుకావడంతో అక్కడ రెండు కేంద్రాలు తెరిపించాం. వచ్చే నెల మొదటి వారం నాటికి అన్ని కేంద్రాలు తెరుచుకోనుండగా, ఒక్కో కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారు. అక్కడ కావాల్సిన వేయింగ్ మిషన్లు, గన్నీలు, టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయి. ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసేలా సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. సన్నధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 72 గంటల్లోగా మద్దతు ధర, బోనస్ జమ అవుతుంది. చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా పౌర సరఫరాల సంస్థ, రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తారు. ధాన్యం తరలించాక ఎలాంటి తరుగు తీయొద్దని మిల్లర్లకు చెప్పాం.

**పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

జిల్లాకు ఖమ్మం నగరం గుండెకాయ వంటింది. జిల్లా జనాభాలో సుమారు 50 శాతం ఇక్కడే ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. రహదారులపై ఎక్కడా గుంతలు లేకుండా జాతీయ రహదారులకు వాడే కోల్డ్ మిక్స్‌ను మరమ్మతులకు వాడాలని చెప్పాం. ఇప్పటికే ఈ పనులు జరుగుతున్నాయి. కోల్డ్ మిక్స్ అనేది కొత్త టెక్నాలజీ. ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ, కార్పొరేషన్ అధికారులతో సమావేశమై రోడ్ల నిర్వహణ, మరమ్మతులపై సూచనలు చేశాం. అలాగే, శానిటేషన్ కోసం కొత్త పరికరాలు కొనుగోలు చేయాలని చెప్పాం. పర్యాటక అభివృద్ధిలో భాగంగా రోప్ వేకు అవసరమైన భూ సమస్య కూడా పరిష్కారమైంది. ఇక టీటీడీ ఆలయ నిర్మాణానికి అల్లీపురంలో భూమి గుర్తించాం.

**'ఇందిరమ్మ' సమస్యలకు పరిష్కారం**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఇబ్బందులు లేవు. జిల్లా మంత్రుల ఆదేశాలతో ప్రతీ నియోజకవర్గంలో గోదావరి ఇసుకతో ఇసుక బజార్ ఏర్పాటు చేయించాం. కూసుమంచి, ఖమ్మంఅర్బన్, కామేపల్లి, మధిర, సత్తుపల్లిలోని ఈ పాయింట్ల ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందిస్తున్నాం. స్థానికంగా ఇసుక దొరికితే అక్కడ కూడా కూపన్ల ద్వారా ఇప్పిస్తున్నాం. ఆధార్‌లో పేరు తప్పుగా ఉండడం, బ్యాంక్ అనుసంధానం కాకపోవడంతో కొందరి ఖాతాలో నగదు పడలేదు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వారితో ఇంకొన్ని కారణాలతో సుమారు 100మందికి ఖాతాలో డబ్బు జమ కాలేదు. వీటిపై విచారణ చేపట్టి పరిష్కరించాం. జిల్లాలో 16వేలకు పైగా చిలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే వంద వరకు ఇలాంటి సమస్యలు ఉన్నాయి. లబ్ధిదారులందరికీ దశల వారీగా క్రమం తప్పక బిల్లులు చెల్లిస్తున్నాం.

# బంద్ సంపూర్ణం, ప్రశాంతం

- జీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పిలుపు
- మద్దతు తెలిపిన అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు
- మధ్యాహ్నం వరకు డిపోలు దాటని బస్సులు



పాత బస్టాండ్ వద్ద వేచి ఉన్న వృద్ధురాలు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న పార్టీలు, ప్రభుత్వాలు ఇకనైనా జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని.. లేకుంటే రాష్ట్రంలో మరో ఉద్యమం తప్పదని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యాన శనివారం రాష్ట్ర బంద్‌లో భాగంగా ఖమ్మంలో చేపట్టిన బంద్ ప్రశాంత వాతావరణంలో విజయవంతమైంది. బీసీ సంఘాలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, తెలంగాణ జన సమితి, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులే కాక ప్రజా, విద్యార్థి సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ఈమేరకు శనివారం తెల్లవారుజామున 4గంటలకే జేఏసీ, అఖిలపక్ష పార్టీల నాయకులు ఖమ్మం బస్‌డిపోకు చేరుకొని బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. అనంతరం ఖమ్మం పాతబస్టాండ్ ఎదురుగా జేఏసీ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. బంద్‌తో మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కకపోగా, పెట్రోల్ బంక్‌లు, షాప్‌లను స్వచ్ఛందంగా మూసివేశారు.

**రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే..**

జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నాయకుడు మందుల రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడుతూ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న పాలకులు తమ అవసరాలకు బీసీలను వాడుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీలు, కుల, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, కొత్తా సీతారాములు, ఆకుల గాంధీ, ఆవుల అశోక్, వై.విక్రమ్, శెట్టి రంగారావు, బిచ్చాల తిరుమలరావు, కత్తి నెహ్రూ, జి.రామయ్య, పుచ్చకాయల వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, సిద్దా సాహెబ్, షేక్ షకీనా, ఎలమందల జగదీష్, పిండిపోలు రామ్మూర్తి చిలకల వెంకటనర్సయ్య, తూరుగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీల బంద్‌కు బీజేపీ నాయకులు సైతం మద్దతు తెలిపి కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుతో బీసీలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఇక ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యాన నగరంలో తెరిచి ఉన్న విద్యాసంస్థలను మూసివేయించారు.

**రూ.1.10 కోట్ల ఆదాయం కోల్పోయిన ఆర్టీసీ**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరుతూ చేపట్టిన బంద్ ప్రభావం ఆర్టీసీపై పడింది. శనివారం తెల్లవారుజాము నుంచే నాయకులు రీజియన్‌లోని ఏడు డిపోలు, బస్టాండ్ల ఎదుట బైఠాయించారు. దీంతో అధికారులు బస్సులను డిపోలు, బస్టాండ్లకే పరిమితం చేశారు. రీజియన్‌లో 562 బస్సులకు గాను 450 బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని బస్సులను మధ్యాహ్నం తర్వాత నడిపించినా పెద్దగా ఫలితం కానరాలేదు. దీంతో ఆర్టీసీ రూ.1.10 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని అధికారులు వెల్లడించారు. కాగా, బస్సులు లేకపోవడంతో దీపావళికి స్వస్థలాలకు బయలుదేరిన వారు ఇబ్బంది పడ్డారు.



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన కమాన్‌బజార్



వెలవెలబోయిన కొత్త బస్టాండ్

## బీసీ రిజర్వేషన్‌తోనే మోదీకి పీఎం పదవి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

సత్తుపల్లి: గుజరాత్‌లో బీసీ రిజర్వేషన్‌తోనే మోదీకి ప్రధాన మంత్రి పదవి దక్కిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన బంద్‌లో భాగంగా సత్తుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో తుమ్మల మాట్లాడుతూ చట్టబద్ధంగా చేసిన సవరణలను చూసి రిజర్వేషన్ల ఆమోదానికి ప్రధాని మోదీ కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో బీసీలకు అన్యాయం చేసిన బీజేపీకి రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్ పెట్టడం బీజేపీ ద్వంద్వవైఖరికి నిదర్శనమని తెలిపారు. సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ గణన చేపట్టి బీసీ బిల్లును తీసుకొచ్చారని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, నాయకులు గాదె చెన్నారావు, దండు ఆదినారాయణ, ఉడతనేని అప్పారావు, ఎం.డీ.కమల్‌పాషా, కె.సర్వేశ్వరరావు, నిమ్మటూరి రామకృష్ణ, టి.యోబు, తోట సుజలరాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

బోనకల్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదివారం బోనకల్ మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బోనకల్‌లో అధికారులతో భట్టి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. ఆతర్వాత ఒంటి గంటకు లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తారు.అనంతరం ఇందిరా డెయిరీ లబ్ధిదారులతో, సాయంత్రం 4–30కి బోనకల్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో భట్టి సమావేశమవుతారు.

## సేవాభావంతోనే వైద్యరంగంలో ఉన్నతి

**'వైట్ కోట్ సెర్మనీ'లో కలెక్టర్ అనుదీప్**



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన వైద్యాధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: వైద్య వృత్తి పవిత్రమైందని.. చికిత్స కోసం వచ్చే వారితో సేవాభావం కలిగి ఉండడం ద్వారా వృత్తిలో ఉన్నతి సాధ్యమవుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన నూతన బ్యాచ్ వైట్ కోట్ సెర్మనీలో ఆయన మాట్లాడారు. ప్రజలు వైద్యులపై అపారమైన నమ్మకంతో వస్తారని, వైద్యులను దేవుళ్లుగా కొలుస్తారని తెలిపారు. వైద్య వృత్తిని ఎన్నుకున్న విద్యార్థులు వృత్తిలో రాణించడమే కాక పేద, ధనిక బేధం లేకుండా చికిత్స అందించాలనే తపన కలిగి ఉండాలని చెప్పారు. ఇటీవల తమ కుటుంబంలోని ఒకరికి కీలకమైన సర్జరీ నిమ్స్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారన్నారు. కోయంబత్తూర్‌కు చెందిన అరవింద్ అనే ఆప్తమాలజిస్ట్ తన కెరీర్‌లో వేల మందికి చికిత్స చేసి కంటి చూపును కాపాడారని తెలిపారు. వృత్తిపై ప్రేమ కలిగి ఉండడం, దానిపై పట్టు సాధించడం, కాలానుగుణంగా పరిజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరొచ్చని కలెక్టర్ వెల్లడించారు. ఇదే సమయాన వైద్యులు సైతం ఒత్తిడి తగ్గించుకుంటూ వారి ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు వైట్ కోట్లు అందజేసి ప్రమాణం చేయించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్, రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాళ్లు సరిత, సృజన, వేణు, కిరణ్ కుమార్, రాంప్రసాద్, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బొగ్గుతోనే సింగరేణికి పేరు



వీకే-7 ఓసీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఈడీ వెంకన్న

సింగరేణి(కొత్తగూడెం): వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం ద్వారా సింగరేణి పేరు నిలుస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాదావత్ వెంకన్న తెలిపారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీ, ఓసీ సీహెచ్‌పీ పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. రుద్రంపూర్ ప్రాంతంలోని మాయాబజార్ వద్ద నిర్మించే సీహెచ్‌పీ ప్లాన్‌పై ఆరా తీశారు. నవంబర్‌లో వీకే-7 ఓసీ మొదలైతే బొగ్గు ఉత్పత్తి, రవాణా మెరుగుపడుతుందని తెలిపారు. ఆ తర్వాత వ్యాగన్ లోడింగ్ పాయింట్, పీవీకే బంకర్, రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు సత్తుపల్లి ఓసీల నుంచి వచ్చే బొగ్గు నాణ్యతను పరిశీలించారు. అనంతరం పీవీకే-5 గనిని ఈడీ సందర్శించారు. ఏరియా జీఎం శాలేం రాజు, ఏరియా ఇంజనీర్ కె.సూర్యనారాయణ రాజు, అధికారులు రామకృష్ణ, శ్రీరమేష్, ఖనిరామ్ భరోసే మహతో, వి.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖకు కిక్కు...

- 116 వైన్స్‌కు 4,043 దరఖాస్తులతో రూ.121.29కోట్ల ఆదాయం
- గత పాలసీతో పోలిస్తే తగ్గిన ఆదాయం, దరఖాస్తులు
- చివరిరోజు రాత్రి పొద్దుపోయే వరకు స్వీకరణ



ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తుదారుల సందడి

ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 116 వైన్స్ కేటాయింపునకు గతనెల 26వ తేదీన మొదలైన దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. అయితే, శుక్రవారం వరకు 2,390 దరఖాస్తులే నమోదు కాగా చివరిరోజు ఏకంగా 1,653 దరఖాస్తులు అందాయి. దీంతో జిల్లాలోని మొత్తం వైన్స్‌కు 4,043 దరఖాస్తులు అందగా ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల చొప్పున ఎక్సైజ్ శాఖకు రూ.121.29కోట్ల ఆదాయం సమకూరింది. గత పాలసీలో 122 వైన్స్‌కు గాను 7,200 దరఖాస్తులు రావడంతో రూ.2లక్షల చొప్పున రూ.144 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి దరఖాస్తు ఫీజు పెంచడంతోనే 3వేలకు పైగా దరఖాస్తులు తగ్గాయని భావిస్తున్నారు. కాగా, ఈనెల 23వ తేదీన లక్కీ డ్రా ద్వారా వైన్స్ కేటాయిస్తారు. డిసెంబర్ 1నుంచి నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా కొత్త వ్యాపారులు రెండేళ్ల కాలపరిమితితో వైన్స్‌ను ప్రారంభిస్తారు.

**వారు సైతం రంగంలోకి...**

గతంలో ఖమ్మంలోని వైన్స్ దక్కించుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల మద్యం వ్యాపారులు ఆసక్తి చూపేవారు. కానీ ఈసారి ఉమ్మడి కృష్ణా నుంచే కాక విజయనగరం, వైజాగ్ వ్యాపారులు ముందుకు రావడం విశేషం. రెండు రోజుల క్రితమే ఖమ్మం చేరుకున్న వారు ఇక్కడే బస చేసి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఎక్కువ అమ్మకాలు ఉండే వైన్స్‌ను ఎంచుకుని టెండర్లు దాఖలు చేశారు.

**పల్లీలు అమ్మే వ్యక్తి కూడా..**

ఈసారి వైన్స్ దక్కించుకోవడానికి బడా వ్యాపారులే కాక చిరువ్యాపారులు సైతం ఆసక్తి కనబరిచారు. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ వైన్స్ ముందు పల్లీలు, ఇతర తినుబండారాలు అమ్మే ఓ వ్యక్తి అదే షాప్ కోసం టెండర్ దాఖలు చేశాడు. గత పాలసీలో మూడు దుకాణాలకు టెండర్ వేసినా దక్కలేదని ఆయన వెల్లడించాడు. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెరగడంతో ఒకే దరఖాస్తు దాఖలు చేశానని.. తప్పనిసరి షాప్ వస్తుందని నమ్ముతున్నట్లు చెప్పడం విశేషం.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉద్యోగులు

**ఎక్సైజ్ అధికారుల ప్రచారంతో...**

మద్యం టెండర్లు చాలారోజులు మందకొడిగానే నమోదయ్యాయి. కొన్నిరోజులైతే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో ఎక్సైజ్ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. వ్యాపార వర్గాలతో సమావేశమవుతూ వైన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇలా సుమారు 25వేల మంది వ్యాపారులతో బృందాలుగా సమావేశాలు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఉద్యోగుల ద్వారా తెలిసింది. తద్వారా చివరి రోజు నాటికి భారీగా దరఖాస్తు నమోదయ్యాయని భావిస్తున్నారు.

**బల్క్‌గా టెండర్లు**

మద్యం వ్యాపారులు ఈసారి పలు షాపులకు బల్క్‌గా దరఖాస్తులు వేశారు. ఓ బడా వ్యాపారి, ఆయన బృందం భద్రాద్రి జిల్లాలోని 70 షాపులకు టెండర్లు వేయగా, ఖమ్మం జిల్లాలోని సింగరేణి మినహా మిగతా అన్ని స్టేషన్ల పరిధిలో 150పైగా దరఖాస్తులు వేసినట్లు తెలిసింది. అలాగే, ఇంకో రెండు బృందాలు కూడా భారీగానే టెండర్లు దాఖలు చేశాయి. భారీగా అమ్మకాలు ఉంటాయని చెప్పే ఓ షాప్‌ను ఎంచుకున్న వ్యాపారుల బృందం పదుల సంఖ్యలో టెండర్లు వేసిందని సమాచారం. ఇక గ్రానైట్ వ్యాపారులు సైతం ఈసారి వైన్స్ దక్కించుకోవడంపై దృష్టి సారించినట్లు తెలిసింది. కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 10మంది చొప్పున నగదు జమ చేసి ఒకటి, రెండు షాప్‌లకు టెండర్లు వేశారని సమాచారం. రిజర్వేషన్లు ఉన్న షాప్‌ల కోసం బడా వ్యాపారులు తమ బినామీలతో దరఖాస్తు చేయించారని చెబుతున్నారు.

## క్లుప్తంగా

### ముష్టికుంట్ల వాసికి డాక్టరేట్


కే.వీ.నారాయణ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన కేవీ నారాయణకు డాక్టరేట్ లభించింది. 'ది రైటింగ్స్ ఆఫ్ ఆర్కే నారాయణ్, ఎన్‌రిచ్‌మెంట్ ఆఫ్ ఇండియన్ ఇంగ్లిష్' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కాగా, నారాయణ ప్రస్తుతం ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అంతేకాక సొంత ఇన్‌స్టిట్యూట్ ద్వారా పేద విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించారు.

### 26న సింగరేణి ఆధ్వర్యాన జాబ్‌మేళా


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సంస్థ ఆధ్వర్యాన నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగరేణి గనులతో కిష్టారం వాసులు నష్టపోయినందున గ్రామంలో పర్యావరణ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, సైలో బంకర్ నుంచి వాయు కాలుష్యం వెలువడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని తెలిపారు. మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, చలసాని సాంబశివరావు, సింగరేణి పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు పాల్గొన్నారు.

### టీటీడీ ఆలయ ప్రతిపాదిత స్థలంలో పనులు

ఖమ్మంఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన ఖమ్మం 15వ డివిజన్ అల్లీపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలంలో శనివారం చెట్ల తొలగింపు పనులను ప్రారంభించారు. ఇక్కడ సుమారు 20 ఎకరాల అసైన్డ్ భూమిని ఆలయ నిర్మాణానికి ప్రతిపాదించగా ఇటీవల దేవాదాయ శాఖ స్థపతి, అధికారులు పరిశీలించారు. అయితే, కంపచెట్లు తొలగించి భూమిని చదును చేస్తే పూర్తిస్థాయి స్వరూపం తెలుస్తుందన్న సూచనలతో పనులు మొదలుపెట్టారు. వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, నాయకులు పత్తిపాటి వీరయ్య, గోని గోవర్ధన్, పత్తిపాటి అప్పారావు, పత్తిపాటి వెంకటేశ్వర్లు, యనిగండ్ల సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సనగండ్ల ఉపేందర్‌రావు, సామినేని సైదులు, ముత్తయ్య, గుండె ఆదినారాయణ, దమ్మాలపాటి సైదులు పాల్గొన్నారు.

### బందోబస్తును పరిశీలించిన సీపీ


పోలీసులతో చర్చిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు శనివారం బంద్‌కు పిలుపునివ్వగా.. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. బందోబస్తుపై ఆరాతీసిన ఆయన శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఏసీపీ రమణమూర్తి, సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### బీమా పరిహారం చెల్లించాల్సిందే..

ఖమ్మంలీగల్: ఆరోగ్య బీమా పథకంలో పాలసీ తీసుకున్న వారికి చికిత్స ఖర్చులు చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పు చెప్పారు. రెండు కేసుల్లో శనివారం వెలువరించిన తీర్పుల వివరాలిలా ఉన్నాయి. మధిర మండలానికి చెందిన బలగం జయమహేశ్వరనాయక్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కుటుంబ సభ్యులతో కలిసి 2021లో రూ.15,287 చెల్లించి ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నాడు. రూ.5.50 లక్షల పరిమితితో ఈ పాలసీ తీసుకోగా, కొన్నాళ్లకే మహేశ్వరనాయక్ కరోనా బారిన పడితే ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సచేయించుకున్నాడు. ఆయనవైద్యం బిల్లులు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయిస్తే క్లెయిమ్ నిరాకరించారు. దీంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్, కొలికొండ శరత్‌బాబు ద్వారా కేసు నమోదు చేశాడు. ఈ మేరకు ఫిర్యాదుదారు చికిత్సకు అయిన రూ.94,945తో పాటు వేదనకు గురిచేసినందుకు రూ.10వేలు, ఖర్చుల కింద రూ.10వేలను 45రోజుల్లో చెల్లించాలని తీర్పు వెలువరించారు. అలాగే, బలగం స్వరూపారాణి దాఖలు చేసిన కేసులో ఆమె చికిత్సకు అయిన రూ.71,245తో పాటు మనోవేదన, ఖర్చుల కింద రూ.20 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

# చూసొద్దాం రండీ !


పోచవరం పాయింట్ వద్ద పర్యాటకుల సందడి(ఫైల్)

- పునః ప్రారంభమవుతున్న పాపికొండల యాత్ర
- వరదలతో ఆగిపోయిన పర్యాటకం
- రాజమండ్రి వైపు ఇప్పటికే మొదలు..
- నేడో, రేపో పోచవరం పాయింట్ వైపు

భద్రాచలం : భద్రాచలం ఏజెన్సీలో పర్యాటక రంగానికి పట్టుగొమ్మలాంటి పాపికొండల యాత్ర మళ్లీ సిద్ధమవుతోంది. వర్షాకాల సీజన్‌లో గోదావరి వరదల నేపథ్యంలో పర్యాటక యాత్ర నిలిచిపోగా.. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టి గోదావరి ప్రవాహం నిలకడగా ఉండడంతో తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఏపీలోని రాజమండ్రి గండిపోచమ్మ ఫెర్రీ పాయింట్‌కు అనుమతులు రావడంతో వారం క్రితమే అక్కడ ప్రారంభించారు. కాగా గోదావరికి ఇవతల వైపున ఉన్న పోచవరం పాయింట్‌కు నేడో, రేపో అధికారిక అనుమతి రానుందని లాంచీల యజమానులు చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌కు పాపికొండల పర్యాటకాన్ని తిలకించేందుకు పలువురు రెడీ అవుతున్నారు.

**దసరా నాటికే కావాల్సి ఉన్నా..**

ప్రతి ఏడాది భద్రాచలం నుంచి పరవళ్లు తొక్కుతున్న గోదావరికి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు భారీగా వరదలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో గోదావరి ఉధృతిని దృష్టిలో పెట్టుకుని పాపికొండల విహారయాత్ర నిలిపేస్తుంటారు. ఈ ఏడాది జూలైలోనే ఈ యాత్రకు బ్రేక్ పడింది. ఈ సంవత్సరం భారీ వరదలు రాకున్నా గోదావరి నదీ ప్రవాహం నిరంతరం 30 – 45 అడుగుల మధ్య నమోదవుతూనే ఉంది. ఈ ఏడాది అత్యధిక పర్యాయాలు గోదావరి పరవళ్లు తొక్కడంతో పాపికొండల యాత్ర ఆలస్యమైంది. దసరా సెలవుల నుంచే పర్యాటక సీజన్ ప్రారంభం అవుతుంది. కానీ ఈ ఏడాది విజయదశమి నాటికి కూడా గోదావరి ప్రవాహం సాధారణ స్థాయికి రాకపోవడంతో జాప్యం జరిగింది.

**దీపావళి నేపథ్యంలో ఎదురుచూపులు..**

మూడు నెలలుగా ఆగిపోయిన పాపికొండల పర్యాటకానికి ఇప్పుడు వాతావరణం అనుకూలంగా మారింది. దీంతో ఏపీ ప్రభుత్వం రాజమండ్రి వైపు నుంచి అనుమతి ఇచ్చింది. గండిపోచమ్మ గుడి బోటింగ్ పాయింట్ వద్ద వారం క్రితమే యాత్ర ప్రారంభమైంది. అయితే తెలంగాణ వైపు నుంచి అత్యధికంగా పర్యాటకులు వచ్చే పోచవరం పాయింట్ వద్ద అనుమతి కోసం ఏజెంట్లు, లాంచీల యజమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆదివారం, దీపావళి సెలవులు రావడంతో త్వరగా అనుమతిస్తే బాగుండేదని అంటున్నారు. యాత్రకు సంబంధించిన అన్ని పత్రాలూ సమర్పించామని, ప్రభుత్వం నుంచి అనుమతి రావడమే ఆలస్యమని లాంచీల యజమానులు చెబుతున్నారు. వీరితో పాటుగా పర్యాటకంపై ఆధారపడి జీవిస్తున్న వివిధ రంగాల ప్రజలు సైతం యాత్ర ప్రారంభం కోసం వేచిచూస్తున్నారు. పాపికొండల యాత్ర ప్రారంభమైతే ఇటు ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రగిరిలోనూ భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది.

**పాత ధరలే అమలు..**

పచ్చని అడవులు, వాటి నడుమ అమాయక ఆదివాసీల జీవన విధానం, కట్టుబొట్టు, సంస్కృతి, సంప్రదాయాలు దర్శనమిచ్చే పాపికొండల యాత్ర ఎంతో మధురానుభూతిని నింపుతుంది. రెండు రోజుల్లో కార్తీక మాసం సైతం ప్రారంభం కానుండడంతో భక్తులు, పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో పాపికొండల పర్యాటక ధరలను గతంలో మాదిరిగానే నిర్ణయించారు. పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 చొప్పున వసూలు చేయనున్నారు. ఇక కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ప్యాకేజీలు ప్రకటించాల్సి ఉంది. పోచవరం ఫెర్రీ పాయింట్ వద్దకు చేరుకోవడానికి సొంత వాహనాల్లో లేదంటే భద్రాచలంలో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.


గోదావరిలో లాంచీ విహారం (ఫైల్)

**నేడో, రేపో ప్రారంభమవుతుంది**

పాపికొండల విహార యాత్ర నేడో, రేపో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజమండ్రి వైపు యాత్ర నడుస్తోంది. పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద లాంచీలు సిద్ధంగా ఉన్నాయి. అనుమతి వస్తే ఇక సందడిగా మారనుంది.

– మహేందర్, టికెట్ల విక్రయ కేంద్రం నిర్వాహకుడు, భద్రాచలం

# 'సాక్షి'పై కుట్రలు సరికాదు


నిరసనలో పాల్గొన్న జర్నలిస్టులు, పార్టీల నాయకులు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఏపీ ప్రభుత్వం
- కూసుమంచి నిరసనలో నాయకులు

కూసుమంచి: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం పత్రికాస్వేచ్ఛను కాలరాసేలా వ్యవహరిస్తోందని పలువురు ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న 'సాక్షి'పత్రికతో పాటు ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్నికాలరాస్తోందని విమర్శించారు. ఏపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో నిర్వహించిన ఆందోళనలో జర్నలిస్టులు, వివిధపార్టీలు, సంఘాల నాయకులుపాల్గొన్నారు. న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి, టీయూడబ్ల్యూ జే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు పోలంపల్లి నాగేశ్వరరావుమాట్లాడుతూ.. సమాజానికి పత్రికలుమూల స్తంభాలుగా నిలుస్తుండగా వాస్తవాలను వెలికితీసే హక్కు ఉందని తెలిపారు. అయితే, ఏపీ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే సాక్షి మీడియా, ఎడిటర్ ధనంజయ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని, మీడియా గొంతు నొక్కితే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు.కాంగ్రెస్,బీఆర్ఎస్, ఎన్డీ, సీపీఎం నాయకులు ఎండీ హఫీజుద్దీన్, ఎండీ కలీమ్,బాబునాయక్, ముత్తేశం, సైదానాయక్, వెంకన్న, చంద్రయ్య, బానోతుఉపేందర్, అద్దంకికోటయ్య, మల్లీడువెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి, సంద్ర బజారు, చెరకుపల్లివీరయ్య, బత్తులఉప్పలయ్య, ఎడవెల్లి రమణారెడ్డి, కొక్కిరేణి వీరస్వామి, వివిధ పత్రికల జర్నలిస్టులు, ఉద్యోగులు చాగంటి వెంకటేశ్వర్లు, మల్లెల ఉపేందర్, వాచేపల్లి హనుమంతరెడ్డి, పెంటమళ్ల కోటయ్య, మెగిలి రామకృష్ణ, పందిరి వెంకటరెడ్డి, ఎండీ రంజాన్‌అలీ,మందులనాగరాజు, అత్తలూరి హనుమంతరావు,వడ్లమూడి వెంకటేశ్వర్లు, పోలేటి నారాయణ, గంధం రాంచందర్‌రావు, రాము, పడిశాల వెంకన్న, రాంబ్రహ్మం,వెంకటేశ్వర్లు, కర్ణబాబుపాల్గొన్నారు.

### భద్రాద్రి డీపీఓగా అనూష


బొప్పన అనూష

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో 62వ ర్యాంకుతో జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పోస్టుకు ఎంపికైన బొప్పన అనూషను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించారు. ఈమేరకు ఆమెను డీపీఓగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఆరు జిల్లాలకు డీపీఓలను నియమించగా జాబితాలో ఖమ్మంకు చెందిన అనూష కూడా ఉన్నారు.

### ఐటీడీఏకు ఉత్తమ అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో కేంద్ర పథకాలను విజయవంతంగా అమలు చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ ఐటీడీఏ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు పీఓ రాహుల్ శనివారంఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ధర్తీ ఆబా జాన్‌జాతీయ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో గల 130 గ్రామాల్లో ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమం ప్రారంభించామని, ఈ మేరకు గిరిజన సంక్షేమ, విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయం చేస్తూ పనులు చేపట్టామని వివరించారు. విజన్ 2030 నాటికి ఆయా గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచేలా అన్ని శాఖ లను అప్రమత్తం చేశామని వివరించారు. అవార్డు ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన పీఓ.. ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో ప్రతిభ చాటిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు.

### పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారంరుద్రహోమంనిర్వహించనున్నట్లుఈఓ ఎన్. రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ఏ విభాగాన్నీ వదలలేదు..

- అన్ని ఫండ్ల నుంచి నిధుల బదలాయింపు
- 30 చెక్కుల ద్వారా రూ.52.89 లక్షలు స్వాహా

వైరా: ఓ ఉద్యోగి నిర్వాకంతో వైరా మున్సిపాలిటీ నిధులు ఏకంగా రూ.52,29,657 పక్కదారి పట్టాయి. కార్యాలయ ఇంజనీరింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్ ఐతంరాజు వెంకటేశ్వర్లు తాత్కాలికంగా అకౌంట్స్ విభాగంలో పనిచేసిన సమయాన మున్సిపల్ నిధులను సొంత ఖాతాలోకి మళ్లించుకున్నట్లు బయటపడడంతో ఈ నెల 14న వరంగల్ ఆర్‌డీఎం షాహీద్ మసూద్ విచారణ చేపట్టారు. అనంతరం ఐతంరాజు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశారు. అయితే, సదరు ఉద్యోగి చెక్కులను ఎవరి పేరు మీద.. ఎంతమేర రాశారు, ఆ నగదు ఎవరి ఖాతాల్లోకి బదలాయించారో ఒక్కో అంశం వెలుగులోకి వస్తోంది. మొత్తం 30 చెక్కుల ద్వారా మున్సిపల్ నిధులను పక్కదారి పట్టించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. జనరల్ ఫండ్ నుంచి 17 చెక్కులు, 15వ ఆర్థిక సంఘం నుంచిఏడు, భవనాల పన్నులఫీజు నుంచి రెండు, పట్టణ ప్రగతినిధుల నుంచి ఒకచెక్కుఇలా నిధులను ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పేరుతో రాసినట్లు తెలిసింది. ఆపై నిధులను వెంకటేశ్వర్లు తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

**కమిషనర్ ఏం చేసినట్లు?**

మున్సిపాలిటీ నుంచి 8 నెలలుగా రూ.52 లక్షల మేర నిధులు ఒకే ఉద్యోగి బదలాయించుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అప్పటి కమిషనర్ వేణు వివరాలేమీ చూడకుండా చెక్కులపై సంతకాలు చేసి చేతులు దులుపుకోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. సంతకం చేసే సమయాన ఏ పనికి, ఎన్ని నిధులు చెల్లిస్తున్నారో ఎందుకు పరిశీలించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాక ప్రతీ చెక్కును ఏ అవసరాలకు జారీ చేస్తున్నారో నమోదు చేసే రికార్డుల్లోనూ వివరాలు లేకపోవడం గమనార్హం. అయితే, పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహిస్తేనే ఎంత మొత్తంలో నిధులు దారి మళ్లాయో తేలనుందని చెబుతున్నారు.

# హైవే సర్వేను అడ్డుకున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ – అమరావతి హైవే నిర్మాణానికి మండలంలోని కామంచికల్‌లో శనివారం చేపట్టిన భూసర్వేను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూనిర్వాసితుల తరఫున హైకోర్టులో కేసు విచారణలో ఉండగానే భూములు, బావులు, చెట్ల గుర్తింపునకు సర్వే చేయడం సరికాదన్నారు. మార్కెట్ ధర కంటే మూడింతలు రెట్టింపు పరిహారం చెల్లిస్తేనే భూమి ఇస్తామని తెలిపారు. రైతుల ఆందోళనతో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు వెనుదిరిగారు. అనంతరం రైతులతో రెవెన్యూ అధికారులు చర్చించగా, పరిహారంపై తేల్చాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు వేములపల్లి సుధీర్, రాధాకృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, అనంతిని శ్రీనివాస్, శ్రీధర్, రఘు, పాటి వెంకటయ్య, ఉపేందర్‌రావు, రంగారావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జలవనరుల శాఖ పనుల పరిశీలన


వైరా రిజర్వాయర్ కాల్వ వద్ద పరిశీలిస్తున్న సీఈ, ఇంజనీర్లు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యాన జరుగుతున్న పనులను ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ ఓలేటి వెంకటరమేశ్‌బాబు శనివారం పరిశీలించారు. ఖమ్మం కైకొండాయిగూడెం వద్ద 21 ఎంబీబీసీపై వంతెన నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించడమే కాక టేకులపల్లి వంతెన సమీపాన ప్రధాన రహదారి పక్కన రిటైనింగ్ వాల్ నిర్మాణ స్థలంపై ఆరా తీశారు. అలాగే, వైరా మండలంలో రిజర్వాయర్ కాల్వల ఆధునీకీకరణ పనులు, స్నానాల లక్ష్మీపురంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణంలో సాంకేతిక అంశాలపై ఉద్యోగులకు సీఈ సూచనలు చేశారు. ప్రతిపాదిత పనుల్లో మార్పులు అవసరమైతే చేయాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అనన్య, బాబూరావు, డీఈ గోపాల్‌రావు, ఏఈ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### 'తప్పే మాకు ఆపాదించొద్దు..'

ఖమ్మంమయూరిసెంటర్: వైరా మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఆర్థిక అవకతవకల్లో అకౌంటెంట్ తప్పుఉన్నట్లు జరుగుతున్న ప్రచారం సరికాదని తెలంగాణ మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ బాధ్యులు పేర్కొన్నారు. తప్పుచేసిన ఉద్యోగిది అకౌంట్స్ విభాగం కాదని, జూనియర్ అసిస్టెంట్ తాత్కాలికంగా అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తించిన సమయాన అక్రమాలు జరిగాయని తెలిపారు. అకౌంట్స్ ఉద్యోగులు గత పదమూడేళ్లుగా మున్సిపాలిటీల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివలింగం, తిరుమలేశ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

# కారులో జర్నీ.. స్టార్ హోటళ్లలో బస

- 20 కేసుల్లో నిందితుడిగా హైటెక్ దొంగ
- వివరాలు వెల్లడించిన నగర ఏసీపీ రమణమూర్తి


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి, పక్కన సీఐలు, ఎస్‌ఐలు

ఖమ్మంఅర్బన్: యుక్త వయస్సులోనే ఇంటి నుంచి పారిపోయి చిన్నచిన్న పనులు చేస్తే వచ్చే డబ్బుతో సంతృప్తి లభించలేదు. దీంతో చోరీల బాట ఎంచుకున్న సదరు వ్యక్తి పలు కేసుల్లో శిక్ష అనుభవించినా తీరు మార్చుకోలేదు. చోరీసొత్తుతో కొన్న కారులోనే దొంగతనాలకు వెళ్లే ఆ నిందితుడు ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తూ విలాసవంతమైన జీవనం సాగిస్తుండగా ఖమ్మంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నగర ఏసీపీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు.

**గుంటూరు నుంచి హైదరాబాద్‌కు..**

ఏపీలోని గుంటూరు జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన మిక్కిలి వంశీకృష్ణ అలియాస్ శ్యామ్‌రిచర్డ్ 17 ఏళ్ల వయస్సులోనే ఇంటి నుంచి పారిపోయాడు. హైదరాబాద్‌లోని ఓ జిరాక్స్ సెంటర్‌లో పనికి కుదిరినా వచ్చే డబ్బు సరిపోక దొంగతనాలు మొదలుపెట్టాడు. అలా హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేసేవాడు. ఫలితంగా పోలీసులకు పట్టుబడి పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చినా తీరు మార్చుకోలేదు. జిల్లాలోని ఖానాపురం హవేలీ, ఖమ్మం – 1, 2, 3 టౌన్‌తో పాటు రూరల్, నేలకొండపల్లి, కూసుమంచి, వైరా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇరవై ఇళ్లలో చోరీ చేశాడు. శుక్రవారం సాయంత్రం ఖమ్మంఅర్బన్ పోలీసులు ఖమ్మం – వైరా రహదారిపై వాహన తనిఖీలు చేపడుతుండగా కారులో వెళ్తున్న వంశీకృష్ణ వివరాలు ఆరా తీశారు. దీంతో చోరీల విషయం బయటపడింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు అంగీకరించడంతో 452గ్రాముల బంగారు నగలు (ప్రస్తుత విలువ రూ.51 లక్షలు), చోరీ సొమ్ముతో కొన్న ఎంజీ ఆస్టర్ కారు (రూ.15 లక్షలు) కలిపి రూ.66 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, చోరీ సొత్తును ఎప్పటికప్పుడు అమ్మేసే వంశీకృష్ణ ఆ డబ్బుతో బెంగళూరు, గోవా, హైదరాబాద్ నగరాల్లోని ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తూ విలాసవంతమైన జీవితం గడిపేవాడని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ఎస్‌ఐ డి.శ్రావణ్‌కుమార్, సిబ్బంది వి.బాబు, వి.హరికృష్ణను ఏసీపీ అభినందించారు.

### అదనపు కోర్టులు ఏర్పాటుచేయండి

హైకోర్టు జడ్జికి 'బార్' సభ్యుల విన్నపం


హైకోర్టు జడ్జి శ్రీనివాసరావును సన్మానిస్తున్న 'బార్' సభ్యులు, పక్కన భద్రాద్రి జడ్జి పాటిల్ వసంత్

బూర్గంపాడు/కొత్తగూడెంటౌన్ : ప్రజల సౌలభ్యం కోసం భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు లేదా అసిస్టెంట్ సెషన్స్ కోర్టును, కొత్తగూడెంలో ఎస్సీ, ఎస్టీ కేసుల కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని, ఫ్యామిలీ కోర్టు, జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేయాలని కొత్తగూడెం, భద్రాచలం బార్ అసోసియేషన్ల సభ్యులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాసరావును కోరారు. సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో భద్రాచలం బార్ సభ్యులు, కొత్తగూడెం కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు జడ్జికి వినతిపత్రాలు అందించారు. భద్రాచలం, మణుగూరు సబ్ డివిజన్లలో 600 పైగా సెషన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా కేంద్రం కొత్తగూడెం వెళ్లాలంటే ఈ ప్రాంత వాసులకు అసౌకర్యంగా ఉందని వివరించారు. ఆ తర్వాత కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పాటిల్ వసంత్, అదనపు జిల్లా జడ్జి సరిత, సీనియర్ జడ్జిలు ఎం.రాజేందర్, కె.కిరణ్‌కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కవిత, జూనియర్ జడ్జిలు కె.సాయిశ్రీ, బి.రవికుమార్, వి.శివనాయక్, డి.కీర్తిచంద్రికారెడ్డి బి.భవాని, కె.సురారెడ్డి, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సభ్యులు జె.గోపీకృష్ణ, భాగం మాధవరావు, కాసాని రమేష్, ఉప్పు ఆరుణ్, ఆడపాల పార్వతి, మాలోత్ ప్రసాద్, కె.చిన్నికృష్ణ, కొడాలి శ్రీనివాసన్, పసుపులేటి రాంబాబు, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి


కుంచం సందీప్ (ఫైల్)

బోనకల్: మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కుంచం సందీప్ (16) శనివా రం మృతిచెందాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాల లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దస రా సెలవుల అనంతరం కళాశాలకు వెళ్లడం ఇష్టంలేక ఇటీవల గడ్డిమందు తాగాడు. దీంతో గుర్తించిన ఆయ న తల్లిదండ్రులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు.

### ఉరి వేసుకుని బలవన్మరణం

కారేపల్లి: మానసిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన మాలోతు తావుర్యా – లక్ష్మి దంపతుల కుమారుడు సాయికుమార్ (25) రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. ఇటీవల బెంగళూరు ప్రాంతంలో పనులకు వెళ్లిన ఆయన దసరాకు ఇక్కడకు వచ్చి మళ్లీ వెళ్లాడు. తిరిగి ఈనెల 17వ తేదీన స్వ గ్రామానికి వచ్చిన సాయికుమార్ మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. తల్లి లక్ష్మి అస్వస్థతకు గురికాగా ఆమెను చికిత్స నిమిత్తం తావుర్యా ఖమ్మం తీసుకెళ్లాడు. శనివారం సాయంత్రం వరకు స్నేహితులతో గడిపిన సాయికుమార్ ఉన్నట్టుండి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు తలుపు పగలకొట్టి సాయికుమార్‌ను ఇల్లెందు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.